క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి సరుకుల పంపిణీ

నిజామాబాద్ రూరల్ : మండలంలోని శాస్త్రీనగర్‌లో గల నిర్మల సదన్ వృద్ధాశ్రమంలో కొండిన్య , గౌడ మహిళ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వృద్ధులకు సరుకులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌండిన్య , గౌడ మహిళ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు పడాల మాధవి గౌడ్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనాథలకు సరుకుల పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని బాల సదన్‌లో దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కౌండిన్య, గౌడ మహిళ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పడాల కవిత, జోగాన పల్లి శారద, అమర ఇందిరా, రాణి, మహిళలు పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం : చిలుకూరు దేవాలయం ప్రధానార్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ కట్ట రాజగోపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయనపై జరిగిన దాడి ఘటనను సోమవారం తీవ్రంగా ఖండించారు. ధర్మపరిరక్షణ ముసుగులో వ్యక్తిగత ప్రయోజనం కోసం స్వార్థపూరిత చర్యలకు పాల్పడేవారిని ఎంతమాత్రం ఉపేక్షించకూడదన్నారు. ప్రభుత్వం దాడికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

12,19తేదీల్లో సదరం క్యాంపులు

డొంకేశ్వర్(ఆర్మూర్): దివ్యాంగుల కోసం ఈ నెల 12, 19వ తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వరకే మీసేవ కేంద్రాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకుని ఉంటే మొబైల్ నంబరుకు ఎస్‌ఎంఎస్ వస్తుందని, అందులో సూచించిన తేదీల్లో హాజరు కావాలన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంపులకు స్లాటు రసీదుతో పాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటో, మెడికల్ రిపోర్టులు తీసుకుని రావాలని సూచించారు.

శ్రీచక్రేశ్వర శివాలయం ఈవోగా రాములు




బోధన్‌రూరల్ : బోధన్ శ్రీ చక్రేశ్వర శివాలయం, మారుతి మందిరం ఈవోగా ఎన్.రాములు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం శ్రీ చక్రేశ్వర శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు, భక్తుల సహకారంతో శ్రీ చక్రేశ్వర శివాలయం, మారుతి మందిర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి



వేల్పూర్: విశ్వవిద్యాలయ కార్యకలాపాల్లో గవర్నర్లకు ప్రవేశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యూజీసీ ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని వేల్పూర్ మండల అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమ వారం వేల్పూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద యూజీసీ ముసాయిదాపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శివకృష్ణ, చమార్ పాల్గొన్నారు.

భగవన్నామస్మరణ చేయాలి



వర్ని: రోజు భగవన్నామ స్మరణ చేస్తూ ఆలయాలను దర్శించుకోవాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి పేర్కొన్నారు. వర్ని మండలం కూనిపూర్ గ్రామంలో నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, డీసీసీబీ మాజీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

వేల్పూర్ : మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం పడగల్ లోని జీసస్ క్రైస్ట్ ప్రేయర్ ఏ.జి చర్చ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాస్టర్ నోవా(జాన్కంపేట్), ఉపాధ్యక్షుడిగా పాస్టర్ రవిపాల్(వేల్పూర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ టీంలు

- కార్పొరేషన్ పరిధిలో మొండి బకాయిదారులకు నోటీసులు
- రెవెన్యూ సిబ్బందితో నిరంతరం రివ్యూ



నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పన్ను వసూళ్లను వేగవంతం చేశారు. ఈ వసూళ్ల కోసం ప్రత్యేక అధికారులను నియమించారు. ఐదుగురు నోడల్ ఆఫీసర్లను నియమించి జోన్‌ల వారీగా పన్నులు వసూలుచేస్తున్నారు. ఆస్తిపన్ను, నీటిపన్ను, పాత బకాయి వసూలును వేగవంతం చేస్తున్నారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ నిరంతరం రెవెన్యూ సిబ్బందితో రివ్యూ నిర్వహిస్తున్నారు. మొండి బకాయిదారులకు నోటీసులు అందజేస్తున్నారు.

డివిజన్‌లలో కూడా చెల్లించవచ్చు

డివిజన్‌ల వారీగా పన్నులు వసూలు చేస్తున్నారు. ఇందులోరూ. 50 వేల లోపు పన్నులను డివిజన్ వారీగా వార్డు ఆఫీసర్‌లు వసూలు చేస్తున్నారు. రూ.50 వేలకు మించిన పన్నులను స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు వసూలు చేస్తున్నారు. ఆయా డివిజన్‌లలో పన్నులు చెల్లించవచ్చు.

నీటి పన్నుపై ప్రత్యేక దృష్టి

కార్పొరేషన్ పరిధిలో నీటి పన్నుపై అధికారులు ప్ర త్యేక దృష్టి సారించారు. ఒక్కరోజులో రూ.5 లక్షల నీటి పన్ను వసూలు చేశారు. ఇంటిపన్ను రూ.18 లక్షలు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

పన్నులు చెల్లించి సహకరించాలి

నగరవాసులు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. ఆయా డివిజన్‌లలో వార్డు ఆఫీసర్లకు, జోన్ కార్యాలయాల్లో కూడా చెల్లించవచ్చు. ప్రత్యేక బృందాల ద్వారా పన్నులు వసూలు చేపట్టాం. నీటి పన్నులు కూడా వెంటనే చెల్లించాలి. నీటిపన్ను చెల్లించకుంటే కనెక్షన్‌లు నిలిపివేస్తాం.

– రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిరికొండ : జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు సిరికొండ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి జరుపుల చిన్నా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు భోజారం తెలిపారు. మంచిర్యాలలో ఈ నెల 4 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెలలో మధ్య ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చిన్నా పాల్గొననున్నాడు. పోటీలకు ఎంపికైనందుకు పాఠశాలలో విద్యార్థిని సోమవారం శాలువా కప్పి సన్మానించి అభినందించారు. పీడీ ప్రశాంత్, ఉపాధ్యాయులు శివరాం, దేవిసింగ్, శ్రీనివాస్, కేతన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల బతుకులు మారట్లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పక్కన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్

- గల్లీలో కాషాయ జెండా ఎగిరే వరకూ విశ్రమించొద్దు
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా నిరుద్యోగుల బతుకులు మారడం లేదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. లక్ష ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్.. కొత్తగా ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఢిల్లీలో ఎగిరిన కాషాయ జెండా గల్లీలో కూడా ఎగిరే వరకూ నాయకులు, కార్యకర్తలు విశ్రమించొద్దని సూచించారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడు తూ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబా ద్, మెదక్ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలను కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడంపై మండిపడ్డారు. జీవో 317, ప్రమోషన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో ఉ ద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రశ్నించే గొంతుకలైన ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యను భారీ మెజార్టీతో గెలిపించే దిశగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి, ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జి కొండా ఆశన్న, నారాయణ యాదవ్, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఇందూరు తిరుమలకు త్రిపుర గవర్నర్ రాక



ఇంద్రసేనారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సింహారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో మంగళవారం మాఘ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే 'ఉత్సవం'లో పాల్గొనడానికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి వస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం ఇంద్రసేనారెడ్డిని నర్సింహారెడ్డి కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాఘమాసంలో వచ్చే పౌర్ణమి సందర్భంగా సంతానం లేని వారికి దివ్య ప్రసాదాన్ని అందజేస్తామని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డితో పాటు నిర్మాత దిల్ రాజు కూడా పాల్గొంటారని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారి అనుగ్రహం పొందాలని నర్సింహారెడ్డి కోరారు.

లయన్ సహారాకు పురస్కారాలు



నిజామాబాద్‌నాగారం : లయన్స్ ఇంటర్నేషనల్ ఎంపవర్ రీజియన్ మీట్ ఆదివారం రాత్రి అమృత గార్డెన్‌లో రీజియన్ చైర్మన్ అనిల్‌పాటిల్ ఆధ్వర్యంలో జరిగింది. లయన్ సహారా సేవలను గుర్తించి 12 ఎక్సలెంట్ అవార్డులను క్లబ్‌కు అందించారు. కార్యక్రమంలో మల్టీజోన్ లీడర్ ప్రకాశ్‌రావు, సూర్యరాజ్, సూర్యభగవాన్ తదితరులున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

సాక్షి ఎఫెక్ట్..

సిరికొండ: ధర్పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో రమేష్ సోమవారం తనిఖీ చేశారు. సాక్షిలో సోమవారం ప్రచురితమైన 'పంపిణీకి నోచుకోని యూనిఫాంలు' అనే కథనానికి విద్యాశాఖాధికారులు స్పందించారు. డీఈవో ఆదేశానుసారం ఎంఈవో పాఠశాలను తనిఖీ చేసి వివరాలు సేకరించారు. ఈ విషయమై ఎంఈవోను వివరణ కోరగా తనిఖీలు చేసింది వాస్తవమేనని, నివేదికను డీఈవోకు అందజేస్తానని తెలిపారు.

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డికి సన్మానం



మోపాల్: డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ జిల్లా చైర్మన్ బోర్గాం శ్రీనివాస్ సోమవారం ఆయన్ను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈసందర్భంగా జిల్లాకు సంబంధించిన అంశాలపై చర్చించి, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్
- వర్ని ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

వర్ని: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా చూడాలన్నారు.ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు, వైద్యులతో పాటు సిబ్బంది హాజరు రిజిస్టరు, ఇన్, అవుట్ పేషంట్ల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యం విధానాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో సిబ్బంది అనుమతులు లేకుండా ఇతర ఆస్పత్రులలో పనిచేయడం, డిప్యుటేషన్‌లకు వెళ్లడంపై అసహనం వ్యక్తం చేశారు. కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే పనిచేయాలని అనుమతి లేకుండా డిప్యుటేషన్లపై, తాత్కాలిక సర్దుబాట్లు చేసుకోరాదని హెచ్చరించారు. కుక్క, కోతి, పాము కాటుకు సంబంధించిన మందుల వివరాలను ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులను ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని ప్రైవేటు మెడికల్‌లకు పంపరాదని సూచించారు. రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. అన్ని చికిత్సలకు వైద్యం చేయాలని, అత్యవసర సేవలకు మాత్రమే జిల్లా ఆస్పత్రికి తరలించాలని సూచించారు.

రేపు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఎడపల్లి(బోధన్) : మండలంలో జైతాపూర్ గ్రామంలోని రైతు పాపారావు పంట పొలంలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించనున్నారు . రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాపారావు కోరారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



విద్యార్థులతో వ్యక్తిత్వ వికాస నిపుణులు వజ్జ నవనీత

సిరికొండ: విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వజ్జ నవనీత సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సోమవారం పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు జీవితంలో లక్ష్యం లేని ప్రయాణం చేస్తే అనుకున్న గమ్యాన్ని చేరలేమన్నారు. ఇంటర్ విద్యార్థినులకు మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	87,500	వెండి(కిలో)	99,500
22 క్యారెట్స్	80,382	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	35	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	తండేల్(తెలుగు)-11.00 1.45 4.40 7.35 10.30
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-1.30, 7.30
స్క్రీన్-3	పట్టుదల(తెలుగు)-11.00,1.40, 4.30, 7.20, 10.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	పట్టుదల(తెలుగు)-10.05,1.15, 4.25,7.35,10.45
స్క్రీన్-3	స్కై ఫోర్స్(హిందీ)-10.15; డాకు మహారాజు(తెలుగు)-1.00, 7.20; దేవా(హిందీ)-4.05, 10.25
స్క్రీన్ -4	దేవా(హిందీ)-10.00, 7.10; స్కై ఫోర్స్(హిందీ)-1.15, 10.25; మదగజరాజ(తెలుగు)-4.00
లలితామహల్	తండేల్(తెలుగు)
దేవి	పట్టుదల (తెలుగు)
నటరాజ్	బాదాస్ రవికుమార్(హిందీ)-
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)



కళకళలాడుతున్న కరివేపాకు తోట

మాక్లూర్ మండలం కృష్ణనగర్ గ్రామంలో రోడ్డు పక్కనే వేసిన కరివేపాకు తోట పచ్చదనంతో చూపరులను ఆకర్షిస్తోంది. రైతు వెంకటరావు ఏడు ఎకరాల విస్తీర్ణంలో కరివేపాకు పంటను పండిస్తున్నారు. గత 15 సంవత్సరాలుగా కరివేపాకును పండిస్తున్నట్లు తెలిపారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

వైభవంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం



నృసింహుడి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నృసింహుడి కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య వైభవంగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా లక్ష్మి దేవిని, అనంతరం నృసింహుడిని పల్లకీలో ఊరేగించి కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. ఎదుర్కోలు అనంతరం వేద పండితులు స్వామివారి కల్యాణం జరిపించారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మారుమోగ్రాయి.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల



బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కళాశాలలో ప్రిన్సిపల్ సురేష్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మా ట్లాడారు. బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ గుర్తింపు పొందిన మొట్టమొదటి సారి తెలంగాణ యూనివర్సిటీ సీవోఈలు డాక్టర్ అరు ణ, డీ.కె. రాజు, ఏసీవోఈ శాంతాబాయి, బాబురావ్, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పరీక్ష ఫలితాలను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్ష ఫలితాలను https://gdctg.cgg.gov.in/bodhan.edu వెబ్ సైట్ ద్వారా విద్యార్థిని, విద్యార్థులు ఫలితాలను తెలుసుకోవచ్చని ప్రిన్సిపల్ వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వరప్రసాద్ ఉన్నారు.